

కాసేపు సేద తీరేలా..

ఐటీ కారిడార్‌లో అర్బన్ ఫర్నిచర్

ఐటీ కారిడార్‌లో అర్బన్ ఫర్నిచర్ ఆకట్టుకుంటోంది. మెహిదీపట్నం, గచ్చిబౌలి, మాదాపూర్ వైపు నుంచి వచ్చేవారు బయోడైవర్సిటీ జంక్షన్‌లో కాసేపు ఆగుతారు. వారితో పాటు అటుగా వెళ్లే ప్రయాణికులు, సమీపంలోని ఓ కార్పొరేట్ ఆస్పత్రికి వచ్చే ప్రజలకు అర్బన్ సీటింగ్ సౌకర్యంగా ఉంటుంది. సెలవురోజు, వీకెండ్స్‌లో, రాత్రిపూట ఐటీ ఉద్యోగులు, ఖాజాగూడ పెద్ద చెరువుకు వచ్చే పర్యాటకులకు ఈ సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. అంతే కాదండోయ్ ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్లు ఛార్జింగ్ పెట్టుకునేందుకు పవర్ పాయింట్లను ఏర్పాటు చేశారు. బయోడైవర్సిటీ జంక్షన్‌లో గచ్చిబౌలి వైపు వెళ్లే రోడ్డులో సర్కిల్ ఇంజనీరింగ్ విభాగం రూ.72 లక్షల వ్యయంతో అర్బన్ ఫర్నిచర్ ఏర్పాటు చేశారు.

– గచ్చిబౌలి








నగరంలో హిమాచల్‌ప్రదేశ్ బృందం పర్యటన



రాయదుర్గం: హిమాచల్‌ప్రదేశ్‌కు చెందిన యువ సంఘం బృందం మంగళవారం నగరంలో సందడి చేసింది. డిసెంబర్ 29వ తేదీన గచ్చిబౌలిలోని ఉర్దూ యూనివర్సిటీకి చేరుకున్న ఈ బృందం సాలార్‌జంగ్ మ్యూజియాన్ని సందర్శించారు. అనంతరం చౌమొహల్లా ప్యాలెస్, బిర్లామందిర్, నెక్లెస్ రోడ్డు, హుస్సేన్‌సాగర్ తదితరాలను తిలకించి వాటి ప్రత్యేకతలను అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు ఉర్దూ విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో నిర్వహించిన 'ఓపెన్ మైక్‌లో పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండలం ఖాజీపల్లి గ్రామంలోని ప్రభుత్వ భూములను కబ్జా చేస్తున్నారనే ఫిర్యాదులపై రెవెన్యూ అధికారులు స్పందించారు. ఈ మేరకు మంగళవారం ఆర్‌ఐ జయప్రకాష్ నారాయణ ఖాజీపల్లి గ్రామంలోని సర్వే నంబర్ 181లో అక్రమ నిర్మాణాలను పరిశీలించారు. ఐదు బేస్మెంట్ల నిర్మాణాలను జేసీబీతో కూల్చివేయించారు. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో.. టమాట 15, పచ్చిమిర్చి 50, బెండ 45, కాకర 50, దొండ 50, దోస 40, ఆలు 40, చామ 50, కీర 40, బీర 60, వంకాయ 30, గోకర 50, బీన్స్ 60, బీట్‌రూట్ 50, క్యాప్సికమ్ 60, క్యాబేజీ 25, క్యారెట్ 60, చిక్కుడు 60, ఉల్లి 60(కేజీ), ములక్కాయలు (1) 10 , క్యాలీ ఫ్లవర్ (1) 30, సొరకాయ (కేజీ) 20, అల్లం 70, వెల్లుల్లి 400.

ఆలయ నిర్మాణానికి విరాళం

నిజాంపేట్: శ్రీ అష్టలక్ష్మీ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి తనవంతు సహకారంగా మధురానగర్ కాలనీకి చెందిన జెట్టి అద్వై రూ.1,01116 చెక్కును మంగళవారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మధురానగర్ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న ఆలయ నిర్మాణానికి దాతలు వస్తు, ధన రూపేణ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు అద్వైను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు హేమంత్, విష్ణువర్ధన్‌రావు, లింగయ్య, రాంబాబు, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ చేసిన నెలలోనే పెన్షన్ పత్రాలు

పటాన్‌చెరు టౌన్: ఉద్యోగ విరమణ పొందిన నెలలోనే పెన్షన్ ప్రయోజనాలను అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని ప్రాంతీయ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ విశాల్ అగర్వాల్ అన్నారు. మంగళవారం పదవీ విరమణ చేసిన చందాదారులకు పెన్షన్ చెల్లింపు ఆర్డర్ కాపీలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ విశాల్ అగర్వాల్ మాట్లాడుతూ... డిసెంబర్ నెలలో పదవీ విరమణ చేసిన 23 మంది చందాదారులకు పీపీఓలను జారీ చేసి అందులో ఆరుగురికి అందజేశామన్నారు. కార్యక్రమంలో పీఎఫ్ కమిషనర్–2 శ్రీదేవి , అసిస్టెంట్ కమిషనర్ రామకృష్ణ, అకౌంట్స్ ఆఫీసర్ అబ్దుల్ అజీమ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహా పడిపూజ

మణికొండ: అయ్యప్ప నామస్మరణతో గొలిదొడ్డి గ్రామం మారుమోగింది. మంగళవారం గ్రామానికి చెందిన గురుస్వామి డి. ప్రభాకర్ ఆధ్వర్యంలో మహా పడిపూజను ఘనంగా నిర్వహించారు. గురుస్వామి గోపాల్‌సింగ్ ఆధ్వర్యంలో గంగపుత్ర నర్సింగ్‌రావు భజన బృందం భక్తి పాటలు అందరినీ అలరించాయి. అనంతరం అన్నదానం చేశారు. పూజా కార్యక్రమంలో వట్టినాగులపల్లి మాజీ ఎంపీటీసీ సభ్యుడు జి.నగేష్ యాదవ్, మాజీ ఉపసర్పంచ్ భగవాన్‌సింగ్, డి.సుధాకర్, డి. పరమేశ్వర్‌రావు, భక్తులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

మణికొండ: చెత్తను కాల్చితే వచ్చే పొగతో అనారోగ్యం కలుగుతుందని నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్, కమిషనర్ టి. కృష్ణమోహన్‌రెడ్డిలు అన్నారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆధ్వర్యంలో రూపొందించిన వాల్‌పోస్టర్‌లను మంగళవారం వారు మున్సిపల్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరు చెత్త రిక్షాల వారికి మాత్రమే చెత్తను ఇవ్వాలన్నారు. ఎక్కడైనా చెత్త కాల్చినట్టు తెలిస్తే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో డీఈ నరేష్‌కుమార్, ఏఈ శ్రీనివాస్, టీపీఎస్ మణిహారిక, శానిటరీ ఇన్‌స్పెక్టర్ లచ్చిరాం, నాయకుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆహ్లాదాన్ని అందించేలా పార్కుల సుందరీకరణ

వెస్ట్‌జోన్ జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి



వెస్ట్‌జోన్ పరిధిలోని పార్కును పరిశీలిస్తున్న జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి, అధికారులు

గచ్చిబౌలి: ఐటీ సెక్టార్‌లోని శేరిలింగంపల్లి జోన్‌లో మాల్స్, హాల్స్‌కు ప్రత్యామ్నాయంగా ఆహ్లాదాన్ని అందించేలా పార్కులను తీర్చిదిద్దుతున్నట్లు శేరిలింగంపల్లి వెస్ట్‌జోన్ జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి స్పష్టం చేశారు. శేరిలింగంపల్లి వెస్ట్‌జోన్ పరిధిలో ఆయన మంగళవారం పర్యటించారు. మాదాపూర్‌లోని కావూరిహిల్స్ పార్కును అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అద్భుతమైన థీమ్‌లతో రూపొందించిన పార్కులు ప్రత్యేకంగా నిలుస్తున్నాయన్నారు. వాకింగ్‌ట్రాక్‌లు, ప్రహరీ గోడలపై స్ఫూర్తినిచ్చే చిత్రాల పెయింటింగ్ చేపడుతున్నామన్నారు. కావూరిహిల్స్ పార్కులో మరమ్మతు పనుల్లో వేగం పెంచాలని, కాలనీలో ఎస్‌బీఐ బ్యాంకు సమీపంలో అదనంగా పార్కు అభివృద్ధి కోసం అంచనాలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. కాలనీ సంఘాలు సైతం పార్కుల శుభ్రతపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ మోహన్‌రెడ్డి, ఈఈ కేవీఎస్ఎన్‌రాజు, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుటుంబానికి, సమాజానికి సమయం కేటాయించాలి

సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి



కొండాపూర్ 8వ బెటాలియన్‌లో పీటర్ బహదూర్ దంపతులను సన్మానించిన కమాండెంట్ సి సన్నీ



సైబరాబాద్ కమిషనరేట్‌లో ఉద్యోగ విరమణ చేసిన వారిని సన్మానించిన సీపీ అవినాష్ మహంతి

గచ్చిబౌలి/రాయదుర్గం: ఉద్యోగ విరమణ అనంతరం కుటుంబానికి, సమాజానికి సమయం కేటాయించాలని సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి సూచించారు. గచ్చిబౌలిలోని సైబరాబాద్ కమిషనరేట్ కార్యాలయంలో మంగళవారం మాదాపూర్ పీఎస్‌లో ఎస్‌ఐ షేక్ ఎక్బాల్, కార్ హెడ్‌క్వార్టర్స్ ఏఆర్‌హెచ్‌సీ కె బాబయ్య పదవీ విరమణ చేయడంతో వారిని సన్మానించి పెన్షన్ పత్రాలను అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వారి సేవలు మరువరానివన్నారు. కార్యక్రమంలో సీపీ(ట్రాఫిక్ డి జోయెల్ డేవిస్, ఏడీసీపీ అడ్మిన్ రవిచందన్‌రెడ్డి, కార్ హెడ్‌క్వార్టర్స్ ఏడీసీపీ షమీర్, ఎస్టేట్ ఆఫీసర్ ఆర్‌ఐ హిమకర్, సీఏఓ అడ్మిన్ గీత, సీఏఓ అకౌంట్స్ వెంకట్‌రెడ్డి, ఏఎస్‌ఐ కోఆపరేటివ్ సొసైటీ ఇన్‌చార్జీ జీ మల్లేషం, రిటైర్డ్ ఉద్యోగులు కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

8వ బెటాలియన్‌లో..

ఉద్యోగ విరమణ చేసిన వారికి భవిష్యత్‌లో పూర్తి సహకారం అందిస్తామని కొండాపూర్ 8వ బెటాలియన్ కమాండెంట్ సన్నీ స్పష్టం చేశారు. బెటాలియన్‌లో ఏఆర్‌ఎస్‌ఐ పీటర్ బహదూర్ ఉద్యోగ విరమణ సందర్భంగా ఆ దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అదనపు కమాండెంట్ బివిరెడ్డి, అసిస్టెంట్ కమాండెంట్ ఎస్‌రాంబాబు, రహమాన్, పార్థసారథిరెడ్డి, ఎం నాగభూషణం, సిబ్బంది పాల్గొన్నారు.

కొత్త బ్రిడ్జిని వెంటనే అందుబాటులోకి తీసుకురావాలి



బ్రిడ్జిపై బైఠాయించి ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

రాజేంద్రనగర్: ఆరాంఘర్ చౌరస్తా నుండి జూపార్కు వరకు నిర్మిస్తున్న నూతన బ్రిడ్జిని వెంటనే ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. సీపీఎం రాజేంద్రనగర్ మండల కమిటీ సభ్యులు, సీనియర్ నాయకులు ఎస్.రామ్మోహన్‌రావు అధ్యక్షతన ధర్నా చేశారు. ఈ ధర్నాకు రంగారెడ్డి జిల్లా కమిటీ సభ్యులు, రాజేంద్రనగర్ మండల కార్యదర్శి జాజాల రుద్రకుమార్ హాజరై మాట్లాడుతూ... ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి ఈ బ్రిడ్జిని పరిశీలించకుండా ఆన్‌లైన్ ద్వారా ప్రారంభించారని, కానీ ఇప్పటికీ ముస్తఫానగర్, దానమ్మ జోపిడీ దగ్గర పిల్లర్లు ఇంకా పూర్తి కాలేదన్నారు. ఇంకా పని జరుగుతుందన్నారు. అధికారులు వెంటనే బ్రిడ్జి పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం రాజేంద్రనగర్ మండల కమిటీ సభ్యులు బచ్చలకూర స్వామి, కాలే రాజు, భాస్కర్, నాయకులు మన్యం శ్రీకాంత్, రంగస్వామి, బలరాం, శివ, యాదగిరి, మహబూబ్ పాషా, సుధాకర్ రెడ్డి, నరసింహ, యూసుఫ్ పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

ఆల్విన్‌కాలనీ: పేద విద్యార్థులకు సందయ్య మెమోరియల్ ట్రస్ట్ అండగా నిలుస్తున్నదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్ యాదవ్ అన్నారు. ఆల్విన్ కాలనీ డివిజన్ శంషీగూడ, ఎల్లమ్మబండ ప్రభుత్వ పాఠశాలల్లో మంగళవారం సందయ్య మెమోరియల్ ట్రస్ట్, ఆర్.కే.వై. ఫౌండేషన్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు ఉచిత స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 350 మందికి పైగా 10వ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు రవీందర్‌రావు, నర్సింగ్‌యాదవ్, నరసింహాచారి, కుమార్ యాదవ్, వెంకటస్వామి, యాదవరెడ్డి, సత్యనారాయణ యాదవ్, స్రవంతి, డాక్టర్ వంశీ రాయల్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



స్టడీ మెటీరియల్ అందజేస్తున్న రవికుమార్ యాదవ్ తదితరులు

అసంపూర్తి పనులను పూర్తి చేయిస్తా

పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే గాంధీ



సమస్యలు తెలుసుకుంటున్న పీఏసీ చైర్మన్ గాంధీ

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని ప్రశాంత్‌నగర్ కాలనీలో అసంపూర్తి పనులను పూర్తి చేయిస్తానని పీఏసీ చైర్మన్ గాంధీ అన్నారు. మంగళవారం మియాపూర్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్, జలమండలి విభాగాల అధికారులతో కలిసి కాలనీలో పర్యటించారు. కాలనీలో డ్రైనేజీ సమస్య, సీసీ రోడ్లు, మంచినీటి సరఫరాను మెరుగుపర్చాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాలనీలో త్వరలో సీసీ రోడ్లు ఏర్పాటు చేస్తామన్నారు. యూజీడీ నిర్మాణ పనులు చేపడుతున్నామని, డ్రైనేజీ ఔట్‌లెట్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని తెలిపారు. కార్యక్రమంలో జలమండలి డీజీఎం నాగప్రియ, మేనేజర్ ప్రశాంతి, జీహెచ్ఎంసీ ఏఈ రాజీవ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహదేవ్, నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

నిరుపేదల సొంతింటి కల సాకారమే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



స్థల పరిశీలన చేస్తున్న ఎమ్మెల్యే

పటాన్‌చెరు: నిరుపేదల సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రవేశపెట్టిందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని బ్లాక్ ఆఫీస్ ప్రాంగణంలో ఇందిరమ్మ మోడల్‌హౌస్ నిర్మాణం కోసం స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మొదటి విడతలో సొంత స్థలం కలిగి ఉండి అర్హులైన ప్రతి ఒక్కరికి ఇంటి నిర్మాణానికి నిధులు కేటాయించనున్నట్లు తెలిపారు. దళారులను ఆశ్రయించవద్దని, పూర్తి పారదర్శకతతో లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందన్నారు. బ్లాక్ ఆఫీస్ ప్రాంగణంలో త్వరలో నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయని తెలిపారు. కార్యక్రమంలో అమీన్‌పూర్ మాజీ జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, హౌసింగ్ ఏఈ సత్యనారాయణ, ఐలేష్ తదితరులు పాల్గొన్నారు.

భార్యాభర్తలు అదృశ్యం



విజయ రామరాజు, సత్యదీప్తిక (ఫైల్)

మియాపూర్: భార్యాభర్తలు అదృశ్యమైన ఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ మాణిక్యం తెలిపిన వివరాల ప్రకారం... మియాపూర్ మయూరినగర్, లక్ష్మీగణపతి నిలయం అపార్ట్‌మెంట్‌లో విజయ రామరాజు(25), భార్య సత్య దీప్తిక(20) కుటుంబ సభ్యులతో కలిసి నివాసముంటున్నారు. ఈ నెల 13వ తేదీ రాత్రి 7.30 గంటల సమయంలో ఎవరికి చెప్పకుండా ఇంటినుండి వెళ్లిపోయారు. మరలా తిరిగిరాలేదు. మరుసటి రోజు సత్యదీప్తిక వారి తల్లిదండ్రులకు అప్పుల బాధతో ఇంట్లో నుండి వెళ్లిపోతున్నామని మేసేజ్ చేసింది. తర్వాత ఇద్దరి ఫోన్‌లు స్విచ్ఛాఫ్ అయ్యాయి. బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో విచారించినా ఫలితం లేకపోవడంతో ఆందోళన చెందిన సోదరుడు అజయ్ వర్మ మియాపూర్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మరో ఘటనలో..



సెన్‌పోల్‌బాలై (ఫైల్)

యువకుడు అదృశ్యమైన సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజస్థాన్ రాష్ట్రం బిల్వారా జిల్లా ఫండర్ గ్రామానికి చెందిన సెన్‌పోస్ బాలై(24) మియాపూర్ న్యూ హఫీజ్‌పేటలోని మార్తాండనగర్ కాలనీలో నివాసముంటూ గచ్చిబౌలిలో ఉద్యోగం చేస్తున్నాడు. ఈ క్రమంలో సెన్‌పోస్ బాలై ఈ నెల 17వ తేదీ ఇంటి నుండి స్వగ్రామానికి వెళ్తున్నానని వెళ్లాడు. అయితే గ్రామానికి చేరలేదు. దీంతో కుటుంబ సభ్యులు చుట్టు పక్కల, బంధువుల, స్నేహితుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. సోదరుడు మనీష్‌బాలై మియాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.